ఆంధ్రజ్యోతి


పౌరకార్మికులకు నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం

కాంగ్రెస్ పాలనలోనే పౌరకార్మికులకు న్యాయం

- దళారుల నుంచి విముక్తి .. వేతనాలూ పెంచాం
- మే డేలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- 12వేల మందికి నియామక పత్రాల అందజేత

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): రాత్రి పగలు పనిచేసేది సామాన్యులు కానీ వేతనాలతో పాటు అన్నింటికీ దళారుల బెడద ఉండేదని అందుకే ఇచ్చిన హామీకి అనుగుణంగా పౌరకార్మికులను రెగ్యులర్ చేశామని సీఎం సిద్దరామయ్య అన్నారు. గురువారం ప్యాలెస్ మైదానంలో కార్మిక దినోత్సవం వేదిక నుంచే పౌరకార్మికులకు నియామకపు పత్రాలను అందజేశారు. రాజ్యసభలో ప్రతిపక్షనేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, డీసీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సూర్జేవాలతో పాటు మంత్రులు పాల్గొన్నారు. బీబీఎంపీ పరిధిలో సేవలందించేందుకు 12,692 మంది పౌరకార్మికులకు నియామకపు పత్రాలను అందజేశారు. ఇదే సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ నగర విస్తీర్ణం పెరుగుతోందని అందుకు అనుగుణంగా జనాభా కూడా ఎక్కువయ్యారన్నారు. కొన్నేళ్ళకాలంగా కాంట్రాక్టు పద్ధతిన పౌరకార్మికులు పనిచేసేవారని వారిని దళారులు దోచేవారన్నారు. అప్పట్లో రూ.7వేలు వేతనం అందేదని ఆతర్వాత రూ.17వేలకు పెంచి నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పౌరకార్మికుల డిమాండ్‌లను పరిష్కరించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. పనిచేసే విషయంలో మేలు కీలు అనేది లేదన్నారు. పనిచేయడంలోనే బాధ్యత, గౌరవంగా భావించాలన్నారు. పౌరకార్మికుల పిల్లల విద్యావంతులు కావాలని అప్పుడే మీ కుటుంబాల్లో మార్పు సాధ్యమన్నారు. 1000 మంది పౌరకార్మికులను విదేశాలకు పంపే ప్రక్రియతో పాటు మరిన్ని డిమాండ్‌లను అంచెలంచెలుగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాహనాల డ్రైవర్‌లతో పాటు సిబ్బందిని త్వరలోనే రెగ్యులర్ చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు మహదేవప్ప, మునియప్ప, భైరతీ సురేష్, రహీం ఖాన్‌తో పాటు పాలికె అధికారులు, నగర పాలక శాఖ ముఖ్యులు, పౌరకార్మిక సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పౌరకార్మికులు

మేడే రోజూ..!

భవన నిర్మాణంలో..

- విరామం లేని శ్రామికుడు..
- కార్మిక దినోత్సవం నాడూ పనుల్లోనే..


సైకిల్‌పై ఇనుప దిమ్మెను తీసుకెళుతున్న కార్మికుడు



హక్కుల కోసం ఏళ్ళతరబడి సాధించుకున్న కార్మిక దినోత్సవం నాడు కూడా విశ్రాంతి లేకుండా కష్టపడుతున్న కార్మికులు గురువారం కనిపించారు. నగరంలోని మంజునాథనగర్‌లో భారీ ఇనుప దిమ్మెలను సైకిల్‌పై ఓ కార్మికుడు తీసుకెళ్లాడు. నాగరబావి పరిధిలోని మూడలపాళ్యలో ఓ భవన నిర్మాణ కార్మికుడు యథావిధిగా పని చేస్తుండగా, బసవేశ్వరనగర్‌లో వర్క్‌షాప్‌లో ఓ కార్మికుడు పని చేస్తూ కనిపించారు.

(ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, బెంగళూరు)


వర్క్‌షాప్‌లో పనిచేస్తూ..

మాజీ ఎంపీ డీకే సురేష్ భార్యనంటూ

సోషల్ మీడియాలో ప్రచారం

- కనకపుర తాలూకాలో మహిళ అరెస్టు

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు, మాజీ ఎంపీ డీకే సురేష్ భార్యగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్న మహిళను రామనగర్ జిల్లా సెన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కనకపుర తాలూకా దొడ్డఆలహళ్ళికి చెందిన పవిత్ర అనే మహిళ ప్రస్తుతం మైసూరులో నివసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఏప్రిల్ 8న పవిత్ర తన సోషల్ మీడియా ఖాతాలు పవిత్రడీకే సురేష్ దొడ్డాలహళ్ళి పేరుతో ఉండే ఫేస్‌బుక్ ద్వారాను, పవిత్ర 256 అనే ఇన్‌స్టా ఖాతా ద్వారా వీడియోలు పోస్టు చేశారు. డీకే సురేష్ భార్యను అంటూ చెప్పుకున్న ఆమె నాకు స్టేటస్ కావాలన్నారు. ఇద్దరి ఫొటోలను ఎడిట్ చేసి పోస్టు చేశారు. వీడియోలు వైరల్ కావడంతో డీకే సురేష్ తరుపు న్యాయవాది ప్రదీప్ రామనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయాల్లో ఉండే డీకే సురేష్ పరువుకు భంగం కలుగుతోందని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రామనగర్ సెన్ పోలీసులు వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. పవిత్రను అరెస్టు చేసిన పోలీసులు ప్రాథమిక విచారణ జరిపిన అనంతరం మండ్య జిల్లా జైలుకు తరలించారు.


బోనులో చిరుత

బోనులో చిక్కిన చిరుత

నగరం గజ గజ..!

- ఈదురుగాలులతో జోరు వర్షం
- గంటలోనే జలమయమైన రహదారులు
- ఆటోపై చెట్టు కూలి డ్రైవర్ మృతి

7వ


ఆటోపై కూలిన చెట్టు


జలమయమైన రహదారి



సూర్యఘర్‌కు ఆదరణ.. ఏదీ..?



- సబ్సిడీ ఉన్నా లబ్ధిదారుల వెనుకడుగు
- నమోదు చేసుకుంది 5.7 లక్షల మంది.. పూర్తయ్యింది 7,821..
- గృహజ్యోతి గ్యారెంటీతో 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- భవిష్యత్తులో కరెంట్ కష్టాలు తప్పవా..?

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం సబ్సిడీ అందజేస్తున్నా రాష్ట్రంలో సూర్యఘర్ పథకానికి ఆదరరణ కరువయ్యింది. ప్రారంభంలో ఉత్సాహంగా నమోదు చేసుకున్న వారు కూడా ఇప్పుడు ప్లాంట్ ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. విద్యుత్ ఉత్పత్తికి దశాబ్దాల కాలంగా థర్మల్ పవర్, జల విద్యుత్, అణువిద్యుత్ వంటి విధానాలు ఉన్నాయి. వాతావరణంలో మార్పులతో విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. నివాసాల సంఖ్య అధికమవుతున్నాయి. దీనికితోడు విద్యుత్ లేకుంటే ఇళ్లు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలతోపాటు ఏ విభాగం కూడా పనిచేయని పరిస్థితి ఉంది. ఆధునికతకు విద్యుత్ అవసరాలు అమాంతంగా పెరిగాయి. గతంలో ఎండాకాలంలో మాత్రమే ఎక్కువగా ఏసీలు, ఫ్యాన్ల వాడకం అధికంగా వాడేవారు. ఇటీవల కొన్నేళ్లుగా కాలం ఏదైనా ఏసీ, ఫ్యాన్లు లేకుండా కొంత సమయం కూడా గడిపే పరిస్థితి లేకుండా పోయింది. ఇందుకు వాతావరణంలో వచ్చిన మార్పులే ప్రధాన కారణంగా ఉన్నాయి. కొన్నేళ్లకాలంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సాగుతోంది. బొగ్గు తవ్వకాలు, రవాణా వినియోగం వంటి విధానాలు భారం అవుతున్నాయి. మరోవైపు జల విద్యుత్ ప్రాజెక్టులు ఎప్పుడు సజావుగా ఉంటాయో తెలియని పరిస్థితి ఉంది. ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉంటే మాత్రమే విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఈ ఏడాది కొంత మేర ఆశాజనకంగా ఉన్నా 2024 సంవత్సరంలో తీవ్రమైన కరువుతో జల విద్యుత్ ఉత్పత్తి స్తంభించిన పరిస్థితులు తెలిసిందే. ఇలా థర్మల్, జలవిద్యుత్ వంటి విధానాలు భారమవుతున్న తరుణంలో కేంద్రప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధమైన విషయం తెలిసిందే.

కేంద్రం ప్రోత్సహించినా..

ప్రకృతిలో లభించే సూర్యశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తికి కేంద్రప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. భారీ ప్రాజెక్టుల ద్వారా కాకుండా ప్రతి కుటుంబం సోలార్‌శక్తిని సద్వినియోగం చేసేలా ప్రధానమంత్రి 'సూర్యఘర్' యోజనను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 2027నాటికి కనీసం కోటి ఇళ్లపై కప్పుపై సోలార్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలనేది కేంద్రం సంకల్పంగా ఉంది. ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని సొంతంగా వినియోగించుకునే వెసలుబాటు ఉంది. తద్వారా వివిధ విధాలుగా ఉత్పత్తి అయ్యే విద్యుత్ డిమాండ్‌ను తగ్గించవచ్చునని కేంద్రం భావించింది. అందుకే దేశవ్యాప్తంగా సూర్యఘర్ ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా 10 లక్షలమంది, రాష్ట్రంలో 7,821 మంది లబ్ధిదారులు సద్వినియోగం చేసుకున్నారు.

ప్రారంభంలో కుతూహలం ...

సూర్యఘర్ ప్రాజెక్టు ప్రారంభంలో ఉన్న ఆసక్తి ఇటీవల తగ్గిపోయిందని చెప్పవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 5.70 లక్షలమంది సూర్యఘర్ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 1.90లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. బెస్కాం పరిధిలో 3650, హెస్కాం పరిధిలో 1300, సెస్కాం పరిధిలో 941, జెస్కాం పరిధిలో 420, మెస్కాంలో 1500మంది సూర్యఘర్ ద్వారా సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకున్నారు.


ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

రూ.75 వేల దాకా సబ్సిడీ

సూర్యఘర్ ప్రాజెక్టుకు రూ.75వేల దాకా సబ్సిడీ ఉంది. అయినా ప్రజలు దీనిపై ఆసక్తి చూపడం లేదు. అందుకు ప్రధాన కారణం రాష్ట్రంలో గృహజ్యోతి గ్యారంటీ ద్వారా 200 యూనిట్లదాకా ఉచిత విద్యుత్ లభ్యమవుతోంది. 3 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నా సూర్యఘర్ అమలుకు వెనుకడుగు వేస్తున్నారు. దీనికితోడు విద్యుత్ కొనుగోలులో వ్యత్యాసం ఉండడం కూడా కారణంగా ఉంది.

అడ్డొస్తున్న నిబంధనలు

సోలార్ ఏర్పాటుకు పలు నిబంధనలు కూడా అడ్డొస్తున్నాయి. సౌరశక్తిని ఇళ్లకు అమర్చుకుంటే అదనపు యూనిట్ల విద్యుత్‌ను ఎస్కాంలకు 25ఏళ్లపాటు విక్రయించాలనే నిబంధన ఉంది. సబ్సిడీ లేకుంటే సోలార్ ప్లాంట్లనుంచి 3.80 రూపాయలు ఒక యూనిట్‌కు ధరగా ఉంటుంది. సబ్సిడీ పొందితే 1-2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌కు ప్రతి యూనిట్‌కు రూ.2.25గా నిర్ణయించగా, 2-3 కిలోవాట్ల ప్లాంట్‌కు ప్రతి యూనిట్‌కు రూ.2.43 ఉంది. 3కిలోవాట్ల సామర్థ్యం కల్గిన ప్లాంట్‌కు యూనిట్‌కు రూ.2.62 చొప్పున ఎస్కాంలు కొనుగోలు చేస్తాయి. ఈ ఏడాది మార్పులు ఉంటాయని చెబుతున్నా ఇప్పటివరకు కొత్త రేట్లకు సంబంధించి ప్రకటించలేదు.

రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణం

రెన్యూవబుల్ ఎనర్జీ ఉపయోగానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నారు. సూర్యఘర్ పథకానికి 60 శాతం సబ్సిడీ మాత్రమే సాధ్యమవుతోంది. సబ్సిడీ గరిష్ఠంగా రెసిడెన్షియల్ హౌస్ హోల్డ్స్‌కు 2 కిలోవాట్స్‌కు గరిష్ఠంగా రూ.30వేలు, కిలోవాట్‌కు రూ.18వేలు, 3 కిలోవాట్స్‌కు గరిష్ఠంగా రూ.78వేలు లభించనుంది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం 78వేల కోట్ల రూపాయలు వినియోగిస్తోంది. ప్రభుత్వ అనుబంధమైన 12 బ్యాంకుల్లో 6.75 శాతం వడ్డీతో రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు అమలు ద్వారా కుటుంబాలకు అవసరమైన విద్యుత్ వినియోగించడంతోపాటు ఎక్కువ ఆదాయం కూడా పొందవచ్చు. ప్రాజెక్టుకోసం చేసిన ఖర్చు ఐదేళ్లలో పొందవచ్చు. మరో 20ఏళ్లు 10-15లక్షల దాకా ఆదాయం గడించే అవకాశం ఉంది. 40ఏళ్ల వరకు ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకోవచ్చు. రాష్ట్రంలో సూర్యఘర్ ప్రాజెక్టుకు ప్రారంభంలో చూపిన ఆసక్తి ఆ తర్వాత సన్నగిల్లింది.


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పిన ఇన్నోవా
- ముగ్గురు తమిళనాడు వాసుల దుర్మరణం
- కృష్ణగిరి నుంచి గోవాకు వెళ్తుండగా ప్రమాదం

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. చిత్రదుర్గ పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిత్రదుర్గ తాలూకా కాత్రాళ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఇన్నోవా కారు పంచర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను తమిళనాడుకు చెందిన అర్జున్(28), శరవణ(31), శ్రీధర్(29)గా గుర్తించారు. ఒకరు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా మరో ఇద్దరు చిత్రదుర్గ ఆసుపత్రిలో చికిత్సలు ఫలించక మృతి చెందారు. మృతి చెందిన అర్జున్ తమిళనాడు రాష్ట్ర పోలీసు కానిస్టేబుల్‌గా చెన్నైలో విధులు నిర్వహిస్తున్నారు. కృష్ణగిరి నుంచి గోవాకు విహారయాత్రకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని చిత్రదుర్గ జిల్లాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చిత్రదుర్గ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుకాసులు..!

- ప్రభుత్వానికి ఆదాయం, ప్రజలకు తక్కువ ధరే లక్ష్యం
- రాష్ట్ర వ్యాప్తంగా 260 రీచ్‌లకు ఈ-టెండర్లు
- టన్ను రూ.850గా నిర్ణయం
- బళ్లారి జిల్లాలో 16 గుర్తింపు : డీడీ ద్వితీయ

బళ్లారి, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడంతో పాటు ప్రజలకు సులువుగా తక్కువ దరకే ఇసుక అందించేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ప్రస్తుతం లీజులో ఉన్న ఇసుక రీచులతో పాటు కొత్తగా ఇసుక రీచ్‌లు లీజ్‌కు ఇచ్చేందుకు అధి కారులు బ్లాకులను గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా 260 ఇసుక రీచ్‌లను గుర్తించి త్వరలో ఈ-టెండర్ పిలవనున్నారని అధికారుల సమాచారం. బళ్లారి జిల్లాలోని సిరుగుప్ప, బళ్లారి రూరల్, కంప్లి నియోజక వర్గల పరిదిలో అలాగే విజయనగర, రాయచూరు, చిత్రదుర్గం జిల్లాల పరిధిలో ఇసుక రీచ్‌లు గుర్తించారు. బళ్లారి జిల్లాలోని తుంగభద్ర రివల్, వేదవతి నదుల్లో ఇసుక తవ్వకాలకు మైన్స్ అండ్ జువాలజీ అధికారులు గుర్తించారు.


బళ్లారి రూరల్ యాల్పి గ్రామం వద్ద వేదవతి నదిలో గుర్తించిన ఇసుక రీచ్

ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక ధర ఎంత అంటే..?

నదుల్లో ఉన్న ఇసుకను తవ్వకాల కోసం టెండర్ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్న బ్లాక్‌ల నుంచి సరఫరాకు టన్నుకు రూ. 850గా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలు నేరుగా ఇసుకను బ్లాక్‌నుంచి తరలించుకుంటే ధర మరింత తక్కువగానే ఉంటుంది. అదే కాంట్రాక్టర్లు, ఇతర భవన నిర్మాణ దారులు, రోడ్లకు వాడే ఇసుకను రూ. 850కి మెట్రిక్ టన్ను నిర్ణయించారు. గృహనిర్మాణం కోసం లబ్దిదారులు నేరుగా రీచ్ పాయిట్ నుంచి ఇసుకను తీసుకువెళ్తే మెట్రిక్ టన్ను రూ. 500కే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. డైరెక్ట్‌గా ప్రజలకే అందుబాటులోకి రావడంతో దళారుల బెడత తగ్గనుందని చెప్పవచ్చు.

ఆదాయ వనరుల పై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వం ప్రజలకు గ్యారెంటీల ఇవ్వడంలో ప్రభుత్వ ఖజానాకు లోటు ఏర్పడుతుంది. దీంతో ఎక్కడెక్కడ ఆదాయ వనరులు సోధించి ఆదాయం పెంచుకునే మార్గాలు వెదుకుతోంది. ఇప్పటికే మద్యం ద్వారా అదనపు ఆదాయం లభిస్తోంది, ఇక ఇతర వాటి ద్వారా కూడా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 260 ఇసుక రీచులకు ఈ టెండర్ పిలవనున్నారని ఒక అధికారి తెలిపారు.

ఇసుక రీచ్ ప్లాంట్లు గుర్తించాము : డీడీ ద్వితీయ

బళ్లారి జిల్లాలో మొత్తం 16 ఇసుక బ్లాకులు గుర్తించాము. దీని ద్వారా 24,11,002 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు వీలు అవుతుంది. తుంగభద్ర, వేదవతి నదుల్లో ఇసుక తవ్వకాల బ్లాక్‌లను గుర్తించాం. దీనిపై గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ అయ్యింది. అక్రమ మార్గంలో నిరోధించి ప్రజలకు తక్కువ ధరకు అందేలా చూస్తాం. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.25	1,578.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	372	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	331	266
నీటి నిల్వ (టీఎంసీలు)	6.85	3.60

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న పీఠాధిపతి శంభులింగేశ్వరస్వామి, అర్చకులు మంజునాథ్

బళ్లారిరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వేదవతి నది ఒడ్డున దిబ్బల సోమేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి హోసళ్లి పీఠాధిపతి శంభులింగేశ్వరస్వామి, అర్చకులు మంజునాథస్వామి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గ్రామ ప్రముఖులు, భక్తులు ఆలయ అభివృద్ధికి ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుడికి సన్మానం



కార్మికుడిని సన్మానిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు సురేష్ కుమార్

బళ్లారిరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్ర గతి సేవా ట్రస్టు కా ర్యాలయంలోని యూజీడీ సంస్థలో పనిచేస్తున్న శ్రీరాములు (27) అనే కార్మికుడికి ఆ సంస్థ కా ర్యాలయ ఆవరణలో మేడే సందర్భంగా ఘనంగా సన్మానించారు. ట్రస్టు అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ కార్మికుల దినోత్సవం సందర్భంగా వారు చేసిన సేవలు గు ర్తించి అభినందనలు తెలపడంతో సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కమేల సూరి, ట్రస్టు కార్యదర్శి సురేంద్రనాథ్, మధు, పవన్ పాల్గొన్నారు.

గాలిలోకి లేచిన ట్రాక్టర్



ఏపీఎంసీ వే బ్రిడ్జి వద్ద గాల్లో నిలిచిన ట్రాక్టర్

కంప్లి, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీఎంసీ వే బ్రిడ్జి వద్ద గురువారం ఓ ట్రాక్టర్ గాలిలోకి లేచింది. రైతులతో కొనుగోలు చేసిన వరిధాన్యం బస్తాలను, వ్యాపారులు వే బ్రిడ్జి వద్ద తూకాలు వేయించేందుకు ట్రాక్టర్‌లో వచ్చారు. వే బ్రిడ్జి వద్ద రోడ్డు పనులు జరుగుతండగా ట్రాక్టర్ అదుపుతప్పి గాలిలోకి లేచింది. ట్రాక్టర్ గాలిలోకి లేవడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. త్వరగా రోడ్డు పనులు పూర్తిచేసి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పేట బసవేశ్వరస్వామి..

రథానికి పూజలు చేస్తున్న భక్తులు



బళ్లారిరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పగల్ గ్రామంలో పేట బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రథోత్సవాన్ని దేవస్థానం నుంచి గ్రామ బొడ్రాయి, ఊరువాకిలి వరకు భక్తుల ఆధ్వర్యంలో లాగారు. రథోత్సవానికి పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

వరి రైతుల బతుకు దైన్యం

- క్వింటాల్ ధాన్యం రూ.19వేల లోపే
- కొనుగోలు కేంద్రాలు తెరవని ప్రభుత్వం
- 6 లక్షల హెక్టార్లలో వరి సాగు
- అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు
- ఇంకా కల్లాల్లోనే వరి ధాన్యం



రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యం

బళ్లారి, మే 1(ఆంధ్రజ్యోతి): వరి సాగు రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. తుంగభద్ర డ్యాం నీరు ఆధారంగా రబీలో సాగుచేసిన వరి ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వరి కొనగోలు కేంద్రాలు ఎక్కడా ప్రారంభించలేదు. పండిన పంటను రైతులు అయినకాడికి అమ్మేసుకుంటున్నారు. పంట పండినా రేటు లేని కారణంగా నష్టపోతున్నామని రైతులు దిగులు చెందుతున్నారు. తుంగభద్ర జలాశయం ఆధారంగా బళ్లారి, కొప్పళ, రాయచూరు జిల్లాల్లో రబీలో 6లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేశారని వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వరి పంట అంతా కోతకు వచ్చింది. రైతులు కోతలు కోసి ధాన్యం రాసులు వేసుకున్నారు. ఎకరంలో 40 బస్తాలు(ఒక బస్తా 75 కిలోలు) వరకూ దిగుబడి అందింది. దీని ప్రకారం 34 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చింది. ఖరీఫ్‌లో రైతుల నుంచి ప్రభుత్వం క్వింటాల్ రూ.2,300 ధరతో కొనుగోలు చేసింది. రబీలో పండిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. బయట వ్యాపారులకే వచ్చినకాడికి అమ్మేస్తున్నారు. వ్యాపారులు క్వింటాల్ రూ.1700 నుంచి 1900 వరకు కొనుగోలు చేస్తున్నారు. అదీ ధాన్యం నాణ్యతగా ఉంటేనే. ఇక ధాన్యంలో తేమ శాతం, నాణ్యత తక్కువగా ఉంటే రూ.1600 లోపే కొంటున్నారు. ధర గిట్టుబాటు కాని రైతులు ధ్యానం రాసులు కల్లాల్లోనూ, రోడ్లపైనే వేసుకుని కాపలా కాస్తున్నారు. వర్షానికి తడిసి ధాన్యం కూడా దెబ్బతింటాయనే కారణంతో రైతులు ఎంతో కొంతకు అమ్మకాలు చేస్తున్నారు. ధాన్యం రేటు తగ్గడం వల్ల రూ. 15 నుంచి 17 వేల దాకా నష్టపోతున్నారు. తుంగభద్ర డ్యాం నీటితో పండించిన వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

తుంగభద్ర డ్యాం కింద రైతులు పండించిన వరి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులు అన్నిరకాలుగా నష్టపోతున్నారు. పంట పండినా అమ్ముకునేందుకు రేటు లేక ఎకరాకు రూ.15 నుంచి 17 వేల వరకు రైతులు నష్టపోతున్నారు. దీనికితోడు అకాల వర్షాలు, వడగండ్ల వానలకు ధాన్యం రాలిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- దరూరు పుల్లయ్య గౌడ్, రైతు రంఘం నాయకుడు

దళారులు మోసం

కొందరు దళారులు రైతులతో ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఉడాయిస్తున్న ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. వారం ఉద్దర, లేదా 15 రోజులు ఉద్దర అనే ఒప్పందంతో రైతుల నుంచి కొందరు మిల్లర్లు, స్థానిక వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు, మిల్లర్లు కొన్న ధాన్యం కూడా అమ్ముడుపోయినా, వారికి కూడా టర్నోవర్ కావడం లేదనే కారణంతో రైతుల చేతికి డబ్బులు రావడం లేదు. ఈ నేపథ్యంలో రైతులకు దళారులు డబ్బులు ఇవ్వకుండా చెక్కేస్తున్నారు. ఇలా అన్ని రకాలుగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులుగా పలు రైతు సంఘాలు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

బళ్లారి పోస్టల్ విభాగానికి 17 అవార్డులు



అవార్డు అందుకుంటున్న చిదానంద

బళ్లారి సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): భారత తపాలా శాఖ నిర్వహించిన వివిధ ప్రచారాల్లో, వార్షిక లక్ష్యాన్ని సాధించడంలో బళ్లారి డివిజన్ రాష్ట్రంలో మొదటి స్థానాన్ని, వార్షిక నికర ఖాతా విభాగంలో రెండవస్థానాన్ని, జాతీయ స్థాయి లేఖ రాత పోటీల్లో రెండో స్థానాన్ని సాధించింది. బెంగళూరులో రెండు రోజుల క్రితం జరిగిన కర్ణాటక సర్కిల్ 2024-25 అవార్డుల ప్రదానోత్సవంలో కర్ణాటక సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ రాజేంద్ర కుమార్ నుంచి బళ్లారి పోస్ట్‌మాస్టర్ పద్మశాలి చిదానంద అవార్డులను అందుకున్నారు. సబ్-డివిజన్ స్థాయిలో జీవిత బీమా రంగంలోఅత్యుత్తమ సేవలకు గాను కూడ్లిగి, హరప్పనహళ్లి సబ్ డివిజన్‌లు అవార్డులు అందుకున్నాయి. శశికుమార్ హిరేమఠ్, శ్రీకాంత్ నీలకంటి అవార్డులు అందుకున్నారు. ప్రధానమంత్రి జన్ సురక్ష యోజన రిజిస్ట్రేషన్‌లో బళ్లారి హెడ్ పోస్టాఫీసు రాష్ట్రంలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఉత్తమ జీవిత బీమా సేవలను అందించే విభాగంలో హొస్పేట్ హెడ్ పోస్టాఫీసు రెండో స్థానాన్ని దక్కించుకుంది. బళ్లారికి చెందిన శ్రీ రాజశేఖర్, హొసపేటకు చెందిన రామారావు, సిద్దప్ప బావికట్టి,శివానంద అవార్డులు అందకున్నారు. బళ్లారి డి విజన్ పోస్టల్ సిబ్బంది బృందంగా చేసిన పనికి ప్రతిఫలంగా ఈ అవార్డులను అందజేశారు. విజయనగరం, బళ్లారి జిల్లాల మొత్తం పోస్టల్ సిబ్బందికే ఈ ఘనత దక్కుతుందని పోస్టల్ సూపరింటెండెంట్ పద్మశాలి చిదానంద సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్‌లో పొదుపుపథకాలు, బీమా పథకాలు, ఇంటి వద్దకే డీబీటీ ఎంపికలు, పోస్టల్ లావాదేవీలు, చివరకు ప్రతి పౌరుడికి సులభంగా అందుబాటులోకి వస్తాన్నాయని, ఆర్థిక భద్రతను సృష్టించడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయని ఆయన అన్నారు. సామాన్యులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, సేవచేయడానికి ఈ విభాగం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

బసవన్న ఆదర్శాలు అనుసరణీయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక నాయకుడు జగజ్యోతి బసవన్న ఆదర్శాలు, సూత్రాలు అనుసరణీయమని బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, మహానగర పాలికె, కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 892వ బసవ జయంతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బసవ బోధనలు భక్తులందరికీ చేరేందుకు బసవ సంగమ పేరుతో కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని ప్రముఖ స్వామీజీలు, ప్రవక్తలందరూ బళ్లారిలో రాష్ట్రస్థాయి ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీరశైవ లింగాయత్ మఠాల వల్లనేడు రాష్ట్రంలో లక్షలాది మంది అక్షరాస్యులుగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని మఠాల స్వామీజీలు అన్ని వర్గాల ప్రజలందరినీ ఉన్నత స్థాయిలో చేర్చిన గొప్ప వ్యక్తి బసవన్న అన్నారు. కొట్టూరు బసవలింగస్వామీజీ మాట్లాడుతూ బసవన్న అందరివాడని, ఆయన అట్టడుగు వర్గాల ప్రజలందరినీ ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప వ్యక్తి అన్నారు. అనంతరం విజయాలు సాధించిన కమ్యూనిటీ ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, రాష్ట్రీయ బసవ దళం గౌరవాధ్యక్షుడు ఏ సిరిగేరి పన్నరాజు, మహానగర పాలకె సంస్థ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బసవన్న రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కంప్లి, మే 1(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని చిక్కజాగనూరు గ్రామంలో గురు వారం బసవన్న రథోత్సవం కన్నుల సాగింది. ఉదయం మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవానికి మొదటి సంవత్సరం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం మల్లికార్జున దేవస్థానం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారికి భక్తులు పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంపన్నగౌడ, అమరేగౌడ, పురుషోత్తమగౌడ, మరేగౌడ, వడ్డు హనుమప్ప పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఘనంగా కార్మిక దినోత్సవం

బళ్లారి గాంధీనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బళ్లారి జిల్లాసమితి నారాయణరావ్ పార్కులో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించి జిల్లాధికార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ మాట్లాడుతూ, మేడేను ప్రపంచవ్యాప్తంగా కార్మికులచే అత్యంత ఉత్సాహంగా ఆచరిస్తారని, పోరాటం ద్వారా సాగే మేడే ప్రాముఖ్యతను వివరించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు శాంత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యాపార స్నేహి వాతావరణ సృష్టించే నెపంతో 8 లేబర్ యాకుల్టను రావడంతోపాటు 29 కార్మికుల ప్రత్యేక చట్టాలను అమలు చేసిందన్నారు. జిల్లా జాయింట్ కార్యదర్శి జి.సురేష్, ప్రముఖులు మురళి, చేతన్, రేష్మా, చిట్టమ్మ, హులుగప్ప, పార్వతమ్మ, నింగప్ప, వీరభద్రయ్య స్వామి, మహేష్‌లతో పాటు యూనియన్ ప్రముఖులు పాల్గొన్నారు.

4న 'చుంబక గాలి' పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న రంగతోరణ ప్రభుదేవా కప్పగల్లు

బళ్లారి సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): రచయిత చంద్రకాంత్ వడ్డు సంపాదకత్వంలో చెన్నబసన్నపై లోహియా ప్రకాశన్ ప్రచురించిన 'చుంబక గాలి' పుస్తకావిష్కరణ 4వ తేదీన నగరంలోని రాఘవ కళామందిరంలో నిర్వహిస్తున్నట్లు రంగతోరణ ప్రభుదేవా కప్పగల్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సినిమా బెంగళూరులో విడుదల కావడంతో ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాఘవ కళామందిరం నుంచి గ్రంథ పల్లకీ తరలివస్తుంది. ఈ కార్యక్రమానికి సండూర్‌లలోని విరక్త మఠం పూజ్య ప్రభుస్వామి అధ్యక్షత వహిస్తారు. పుస్తకాన్ని దేశంలోని సీనియర్ రచయిత్రి శివమొగ్గకు చెందిన సవితా నాగభూషణ్ ఆవిష్కరిస్తారు, న్యూఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ కన్నడ సలహా మండలి సభ్యుడు డాక్టర్ చిదానంద సాలి, కువెంపు భాషా భారతి అథారిటీ సభ్యుడు డాక్టర్ జాజి దేవేంద్రప్ప, లోహియా చన్నబసవన్న అనుబంధం, కృషి గురించి మాట్లాడుతారు. అనంతరం జిల్లాకు చెందిన వివిధ గాయకులు, కన్నడ పాటలను ప్రదర్శిస్తారని ఆయన అన్నారు. సమావేశంలో సాహితీవేత్త గంగాధర్ పత్తార్, న్యాయవాది అంకలయ్య, ఆడిటర్ సిద్దరామేశ్వర గౌడ్, రిటైర్డ్ అధికారి చోరనూర్ కొట్రప్ప, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్లనగౌడ శంకరబండె, పాత్రికేయులు మంజునాథ్, శశిధర్‌మేటి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



అజ్జయ్య (ఫైల్)

కంప్లి, మే 1(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకాలోని దూపదహళ్లి గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్న లైన్‌మన్ గజాపురం అజ్జయ్య (28) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామంలో విద్యుత్ పనులు చేపడుతున్న తరుణంలో విద్యుత్ చార్జింగ్ చేసేందుకు స్తంభాన్ని ఎక్కి పనిచేస్తుండగా విద్యుత్ ప్రవహించి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జెస్కాం అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన అజ్జయ్యను పరిశీలించారు. ఘటనపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.

దొంగల ముఠా అరెస్టు.. 27 బైకుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న పోలీసులు

బళ్లారిరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): నగరంలో కొద్దిరోజులుగా బైకు దొంగతనాలకు పాల్పడుతున్న వారి కోసం ఎస్పీ శోభారాణి, అడిషనల్ ఎస్పీ నవీన్‌కుమార్, డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి మార్గదర్శనంలో బ్రూస్‌పేట్ సీఐ మాంతేష్ నేతృత్వంలో గాలింపు ముమ్మరం చేశారు. బళ్లారి గ్రామీణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బొమ్మనహాళ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురి దొంగల ముఠాను అరెస్టు చేశారు. చోరీకి పాల్పడ్డ నితిన్ అలియాస్ కార్తీక్, మహబూబ్ బాషా, ప్రకాష్, మురళీ కృష్ణ, అశోక్, రవిలను అదుపులోకి తీసుకుని చోరీకి గురైన 27 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బైకుల విలువ రూ.10.70 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. దొంగలను రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ షెహనాజ్, ఏఎస్‌ఐ మల్లికార్జున, పోలీసులు ఉమేష్ రెడ్డి, శ్రీనివాస్, శివరాజ్, రామాంజనేయ, దొడ్డ బసవన్న గౌడ, షేక్ జిలాన్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువతి మృతి

- సెల్ మాట్లాడుతుండగా ప్రమాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

బళ్లారి గాంధీనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న రైలును గమనించక మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న యువతిని రైలు ఢీ కొన్న ఘటన దావణగెర జిల్లా, హరిహర రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలు బళ్లారి నగరంలోని సత్యవాణి నగర్‌కు చెందిన శ్రావణి(23)గా గుర్తించారు. యువతి మైసూరులో ఎంబీఏ చదువుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. హరిహరలోని బంధువుల ఇంటిలో ఓ కార్యక్రమానికి బెంగళూరు నుంచి గోల్‌గుంబాజ్ గుండా మంగళవారం రాత్రి 2.15 గంటల సమయంలో హరిహర రైల్వే స్టేషన్‌లో దిగింది. రైల్వే స్టేషన్‌కు వచ్చినట్లు రైల్వే ప్లాట్‌ఫాం వద్ద నిలబడి ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన విజయపుర మంగళూరు రైలు ఢీ కొంది. ప్రమాదంలో శ్రావణి ముఖం, తలకు బలమైన గాయాలు తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతదేహాన్ని దావణగెర చిటగేరి జిల్లా ఆసుపత్రిలో శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనా స్థలానికి జీఆర్‌పీ ఏఎస్ జాన్ కోరియస్, ఆర్‌పీఎఫ్ పోలీసు పరమేశ్వర్ నాయక్, గోల్‌గుంబజ్ రైలును ఆర్‌పీఎస్ బి.ఎస్. సతీష్, సిబ్బంది చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు జీఆర్పీ పోలసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

పెయింటర్లకు అండగా ఉంటాం



పెయింటర్ల సంఘం సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

హోసూరు, మే 1(ఆంధ్రజ్యోతి): పెయింటర్లకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ప్రకాశ్ హామీ ఇచ్చారు. మేడే సందర్భంగా హోసూరు కార్పొరేషన్ పరిధిలో కృష్ణగిరి జిల్లా బిల్డింగ్ పెయింటర్స్ ఇంప్రూవ్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవ సంబరాలు ఉత్సాహంగా సాగాయి. సంఘం జెండాను ఎగురవేశారు. 50మందికిపైగా పెయింటర్‌లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ ఎస్‌ఏ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్య ముఖ్యులుగా పాల్గొన్నారు. అసోసియేషన్ పెయింటర్లకు జ్ఞాపికలు అందచేసి శాలువాలతో సత్కరించారు. ఇదే సందర్భంగా కొంతమందికి ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాదేశ్‌తోపాటు స్థానిక ప్రముఖులు మణి, మంజునాథ్, రమేశ్, విల్సన్‌రాజ్, కాశీనాథన్, సంఘం ట్రస్టీ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటం



ర్యాలీ చేస్తున్న కార్మికసంఘం నాయకులు, సభ్యులు

హోసూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక చట్టాలతో కార్మికులను దోపిడీ చేస్తున్న కార్పొరేట్ ఫాసిజంను అడ్డుకునేలా పోరాటం చేద్దామని న్యూ డెమోక్రటిక్ లేబర్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. సంఘం ఆధ్వర్యంలో గురువారం బాగలూరు శాఖలో జెండాను ఎగురవేశారు. సంఘం జనరల్ సెక్రటరీ శంకర్ మాట్లాడుతూ కార్మిక దోపిడీని సహించేది లేదన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగుతుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రన్, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మిఠాయిలు పంపిణీ



మిఠాయిలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లాలోని రాయకొట్టై పట్టణంలోని బస్టాండ్‌లో మే డే సందర్భంగా గురువారం కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆటో డ్రైవర్లు, లోడ్ లిఫ్టర్‌లు తదితరులకు స్వీట్లు అందచేశారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం, కెలమంగలం వెస్ట్ యూనియన్ కార్యదర్శి మురుగన్, అన్నాట్రేడ్ యూనియన్ కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పి పుల్లయ్య (జయంతి)



తెలుగు సినీరంగంలో దర్శకుడు, నిర్మాత పీ పుల్లయ్యగా పేరొందిన పోలుదాసు పుల్లయ్య 1911 మే 2న నెల్లూరులో జన్మించారు. 'పద్మశ్రీ పిక్చర్స్' పతాకంపై అర్ధాంగి, జయభేరి వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. 'అర్ధాంగి' సినిమాకు బెస్ట్ ఫిల్మ్‌ఫేర్ అవార్డు దక్కింది. 'సిరి సంపదలు' 1960లో ఎన్టీఆర్ నటించిన 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం' సినిమాలు ఉత్తమ సినిమాగా నిలిచాయి. కాగా నటి పి శాంతకుమారిని పెళ్ళి చేసుకున్నారు. 1950-80ల మధ్య ఎన్నో హిట్ సినిమాలు తీశారు. రఘుపతి వెంకయ్య అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 1985 మే 29న కన్నుమూశారు.

సత్యజిత్ రే (జయంతి)



'భారతరత్న' అందుకున్న తొలి సినీరంగ ప్రముఖుడు సత్యజిత్ రే 1921 మే 2న కోల్కత్తాలో జన్మించారు. ఇరవయ్యో శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకరిగా పేరొందారు. సినిమాలు, లఘుచిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తం 37 చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తొలి సినిమా 'పథేర్ పాంచాలీ' కేన్స్ చలన చిత్రోత్సవంలో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. దర్శకత్వం సహా సినీ రంగంలోని ఇతర విభాగాలపై అవగాహన కలిగారు. 1992లో 'గౌరవ ఆస్కార్ పురస్కారం' అందుకున్న తొలి భారతీయుడు. పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, నేషనల్ ఫిల్మ్ అవార్డులు ఇతరత్రా పొందారు. 1992 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

మాయా రావ్ (జయంతి)



కథక్ నృత్యకారిణి మాయా రావ్ 1928 మే 2న బెంగళూరులో జన్మించారు. ఒడిశ్శాకు చెందిన కథక్ నృత్యాన్ని కర్ణాటకలోనూ, దక్షిణాదిన విస్తృతం చేశారు. శంభు మహారాజ్ వద్ద శిక్షణ పొందారు. హిందూస్థానీ సంగీతంలోనూ తర్ఫీదు పొందారు. నాట్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కథక్ అండ్ కొరియోగ్రఫీని బెంగళూరులో 1987లో ఏర్పాటు చేయగా 3వేలమందికిపైగా శిక్షణ పొందారు. కర్ణాటక సంగీత్ నృత్య అకాడమీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించి జాతీయస్థాయి ఆర్ట్ ఫెస్టివల్స్ నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ, రాజ్యోత్సవ, శాంతలా అవార్డు తదితరులు పాల్గొన్నారు. 2014 సెప్టెంబరు 1న కన్నుమూశారు.

సౌమ్య స్వామినాథన్ (పుట్టినరోజు)



సౌమ్య స్వామినాథన్ యాదవ్ 1959 మే 2న చెన్నైలో జన్మించారు. హరిత విప్లవ పితామహగా పేరొందిన ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె. చిన్నపిల్లల వైద్యురాలిగా, క్లినికల్ సైంటిస్ట్‌గా రాణించారు. పక్షవాతం, హెచ్ఐవీలపై పలు పరిశోధనలు చేశారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో చీఫ్ సైంటిస్ట్‌గా కొనసాగుతున్నారు. 2017 నుంచి 2022 వరకు డబ్ల్యుహెచ్‌ఓలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రోగ్రామ్స్‌గా వ్యవహరించారు. ఆస్ట్రాజెనికా రీసెర్చ్ ఎండోమెంట్ అవార్డు, పలు గౌరవ పురస్కారాలు అందుకున్నారు.

బాలకార్మికులకు ఉత్తమ విద్య అందించండి

● బీఈఓ రామచంద్ర పిలుపు

ముళబాగిలు, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ పిల్లలను బాలకార్మికులుగా కాకుండా వారికి ఉత్తమ విద్య అందించాలని తద్వారా సమాజంలో ఉన్నతస్థాయిలో కొనసాగేందుకు ప్రోత్సహించాలని బీఈఓ కేఎన్ రామచంద్ర పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్ర కట్టడ నిర్మాణ కార్మికుల సంఘం, తాలూకా న్యాయసేవల సమితి సంయుక్త ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం వద్ద మేడేను పురస్కరించుకుని గురువారం కార్మిక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఈఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం పలు ప్రత్యేక పథకాలు రూపొందించాయని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉత్తమ జీవనం సాగించాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కార్మికులకోసం రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేసేలా చట్టాన్ని తెచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్మికులు కలసికట్టుగా తమ హక్కులకోసం పోరాటం చేయాలన్నారు. భిన్నాభిప్రాయాలకు అవకాశం లేకుండా ముందుకు సాగాలని సూచించారు. గ్రామాలలో నిరుద్యోగాన్ని తొలగించేలా ఉపాధి హామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అయితే ఇటీవల కొన్ని చోట్ల ప్రభావితులైన కాంట్రాక్టర్లు పొక్లైనర్‌లతో పనులు చేపట్టడం ద్వారా కార్మికులకు కూలిపనులు లేకుండా చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కార్మిక దినోత్సవాన్ని తాలూకా యంత్రాంగం, కార్మికశాఖ సహకారంతో ఏర్పాటు చేస్తే మరింత అనుకూలంగా ఉంటుందన్నారు. న్యాయవాదులు కేఎన్ నాగరాజ్, టి సుబ్రమణి మాట్లాడుతూ కార్మికులు ఏదైనా సమస్య తలెత్తితే జిల్లాకేంద్రంలోని కార్మిక కోర్టులో కేసు నమోదు చేయవచ్చునన్నారు. కార్మికులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టులోనూ తాలూకా న్యాయసేవా సమితి ఉందని కార్మికులు ఉచితంగా న్యాయ సలహాలు పొందవచ్చునన్నారు. లాయర్ ఖర్చు కోర్టు భరిస్తుందన్నారు. సంఘం కార్యాలయానికి అంబుజ మాట్లాడుతూ కార్మికులు తప్పనిసరిగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు వీలవుతుందన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి గౌరవం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుబ్రమణి, కార్యదర్శి కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు ఎం బాబు, ఉపాధ్యక్షుడు రాజణ్ణ, సహకార్యదర్శి వెంకటప్ప, కోశాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఈఓ రామచంద్ర

కార్మికుల హక్కులు కాలరాసే విధానం సరికాదు

● కార్మిక దినోత్సవంలో వక్తలు

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా కార్మికుడంటే నిరంతరంగా పనిచేస్తుండటమే విధిగా సాగిన వేళ ఎంతోమంది దశాబ్దాల కాలంగా పోరాటాలు చేసి హక్కులను సాధించారని కర్ణాటక వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ కె ఎన్ రాజణ్ణ అభిప్రాయపడ్డారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని టౌన్‌హాల్‌లో ప్రత్యేక సభ జరిగింది. అంతకు ముందు నగర వీధులలో కార్మికులు ఎర్రజెండాలతో ర్యాలీలు జరిపారు. సభలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి వి. గోపాలగౌడ, కర్ణాటక చలనచిత్ర కార్మికసంఘం అధ్యక్షులు అశోక్, సాహితీవేత్త డాక్టర్ కె.షరీఫాలు ముఖ్యులుగా పాల్గొన్నారు. మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కార్మికుల ప్రాథమిక హక్కులు భంగం కలిగేలాంటి విధానాలు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు పనిగంటలతో పాటు పనిచేసే వాతావరణం ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా సదుపాయాలు ముఖ్యమన్నారు. ఆధునిక సమాజంలో కొత్తతరం పరిశ్రమలు వస్తున్నాయని వారు కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు, న్యాయసంస్థలు ప్రత్యేకతను కనబరచాలన్నారు. కార్మిక సంఘం సంయుక్త కార్యదర్శి మెల్కియార్ ఆర్‌డిలు పాల్గొన్నారు. కార్మికులు పాటలు, నృత్యాలతో ప్రత్యేకత కనబరచారు.



కార్మిక దినోత్సవంలో పాల్గొన్న మాజీ న్యాయాధికారి గోపాలగౌడ, సాహితీవేత్త షరీఫా



నగర వీధులలో కార్మికుల ర్యాలీ ఇలా..

మే డే స్ఫూర్తితో పోరాడుదాం

● ఏఐయూటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ఎస్ వీరేశ్

రాయచూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మే డే స్ఫూర్తితో పోరాడుదామని ఏఐయూటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ఎస్ వీరేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్నిగురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కన్నడ భవనం వద్ద సంఘం ఆయన జెండాను ఎగరవేసి కార్మికులకు శుభకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మిక శక్తి ఏకమై పోరాడి సాధించుకున్న హక్కుల దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని పోరాడుదామన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో : ఐక్య పోరాటాలకు ప్రతీకగా మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పని చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్ శరణబసవ పిలుపునిచ్చారు. సంఘం పిలుపు మేరకు సీఐటీయూ కార్యాలయంలో మే డేను ఘనంగా నిర్వహించారు.

సిరుగుప్ప: కార్మికుల ప్రాణాల త్యాగమే మేడే అని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఓబుళేశ్వరప్ప అన్నారు. గురువారం సిరుగుప్పలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. హైస్కూలు గ్రౌండ్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేతాజీ వ్యాయామ శాలలో సంఘం జెండాను ఆయన ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ అమెరికా చికాగో నగరంలో కార్మికులకు రేయి పగలు లేకుండా పనులు చేసుకునే వారన్నారు. ప్రాణాలను త్యాగం చేసి బడాబాబులకు వ్యతిరేకంగా చేసిన పోరాటమే మేడే అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పయ్య, దళితుల హక్కుల పోరాటసమితి అధ్యక్షుడు ఈరణ్ణ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి, జనవాది మహిళా సంఘం అధ్యక్షురాలు రేణుక, ఖాజాబీ, తిమ్మారెడ్డి, బసవరాజు, నాగరాజుగౌడ పాల్గొన్నారు.

తోరణగల్లు: పట్టణంలోని సూరి భవనంలో కార్మిక దినోత్సవాన్ని సంఘం పదాధికారులు ఘనంగా నిర్వహించారు. పనిచేస్తున్న కార్మికులకు హక్కులను కాపాడటానికి ఎనిమిది గంటల పని కోసం కార్మికులు సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. అంతిమ విజయం దినమే మే డే అని జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న బసయ్య అన్నారు. సంఘం పదాధికారులు దేవన్న, సుంకన్న, స్వామి, రైతు సంఘం పంపన్నగౌడ, తిమ్మప్ప, ఇస్మాయిల్, ఉలిగప్ప పాల్గొన్నారు.



రాయచూరులో ర్యాలీ చేస్తున్న ఏఐయూటీయూసీ నాయకులు



సిరుగుప్పలో...



తోరణగల్లులో..

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

● రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ కోరారు. అమోఘ వర్ష పేరుతో కొత్తగా అందుబాటులోకి వచ్చిన కేఎస్ఆర్టీసీ ఏసీ బస్సు సర్వీసును గురువారం ఎమ్మెల్యే నగరంలోని సెంట్రల్ బస్‌స్టేషన్ వద్ద ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికులకు ఏసీ సౌకర్యంతో కూడిన బస్సును బెంగళూరు వరకు నడిపేందుకు అధికారులు అందుబాటులోకి తెచ్చారన్నారు. కల్యాణ-కర్ణాటక రోడ్డు రవాణా శాఖ కలబుర్గి డివిజన్ అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. యువకుడి మృతి

రాయచూరు, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా గలగ్ కేఈబీ క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న యువకుడు మృత్యువాతపడ్డాడు. దేవదుర్గ వైపు వెళుతున్న కేఎస్ఆర్టీసీ బస్సును ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడు వేగంగా వచ్చి బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో యువకుడి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. యువకుడిని రమేశ్(30)గా గుర్తించారు. జాలహళ్ళి పోలీసులు కేసు నమోదు చేశారు.

బోనులో చిక్కిన చిరుత

కంప్లి, మే 1(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలుకా వెంకటగిరి గ్రామ సమీపంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన చిరుత ఎట్టకేలకు శుక్రవారం అటవీశాఖ ఉంచిన బోనులో చిక్కింది. కొన్ని రోజులుగా అక్కడక్కడా కనిపించిన చిరుత జనంలో కలకలం రేపింది. బోన్లో చిరుత పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం చిరుతను కమలాపురం జంతు ప్రదర్శనశాలకు తరలించారు.

హైడ్రాలిక్ క్రేన్‌ను ఎత్తుకెళ్లిన దొంగ

● కేసు ఛేదించిన పోలీసులు

బళ్లారి గాంధీనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): భారీ చోరీని పోలీసులు ఛేదించారు. భారీ అంటే రూ.కోట్లలో కాదు.. ఏకంగా రోడ్డు ప్రక్కన నిలిపిన ఎత్తైన హైడ్రాలిక్ క్రైన్ చోరీకి గురయ్యింది. ఏకంగా 495 కిలోమీటర్ల మేర ప్రయాణించినా క్రేన్‌తో సహా నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు విజయం సాధించారు. హబ్లీ నగర శివారు ప్రాంతమైన తారిహాల పారిశ్రామిక వాడ ప్రాంతంలో నిలిచిన సుమారు రూ.14లక్షల విలువ చేసే భారీ హైడ్రాలిక్ మొబైల్ క్రైన్ చోరీకి గైరందని క్రైన్ యజమాని రఘునాథం హుబ్లీ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 72గంటల్లోనే హైడ్రాలిక్ క్రేన్‌తో పాటు ఖానాపుర తాలూకా నందగడ ప్రాంతానికి చెందిన సైపుల్లా ముల్లా అనే నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ మురగేష్ చెన్నణ్ణవర నేతృత్వంలో బృందం సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా బెళగామ్, కొల్లాపుర, సతారా, కరాడా, ఉత్తర కన్నడ జిల్లా వ్యాప్తంగత మూడురోజులుగా సుమారు 495 కిలోమీటర్లు నిందితుడు ప్రయాణించాడు. చివరికి యల్లాపురవద్ద హళ్ళికేరి క్రాస్‌లో క్రేన్‌తో సహా పట్టుకున్నారు. నిందితుడు ఎవరికీ అనుమానం రాకుండా... జాతీయ రహదారుల్లో టోల్‌గేట్స్‌ను తప్పిస్తూ గ్రామీణ ప్రాంతాల మీదుగా ప్రయాణించాడు. పోలీసులు గ్రామీణుల సమాచారంతో, సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకోవడంతో నిందితుడు అవాక్కయ్యాడు. అప్పులు తీర్చేందుకు ఈ కృత్యానికి పాల్పడినట్లు పోలీసుల ముందు నిందితుడు అంగీకరించాడు. ఈ కార్యచరణలో పీఎస్ఐ ఎండీ పాటిల్, సిబ్బంది హెచ్‌బీ ఐహొళ, అబ్రార్ పాటిల్, అబ్దుల్ కారక, చెన్నప్ప, బల్లోళ్ళి, మహంతేష్ మద్దీన, గిరీష్ తిప్పణ్ణ, సాంకేతిక సిబ్బంది తిప్పణ్ణ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న హైడ్రాలిక్ క్రేన్‌తో నిందితుడు..

నగరం గజ..గజ..!

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం వణికించింది. జోరువానతో రహదారులు జలమయమయ్యాయి. వర్షంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల చెట్లు, చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. కత్రిగుప్పె ప్రాంతంలో ఆటోపై చెట్టు కూలి ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడిని ఇట్టమడు ప్రాంత వాసి మహేశ్ (45)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. బీబీఎంపీ అత్యవసర సిబ్బంది కార్యాచరణలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. రిచ్‌మండ్ సర్కిల్, శాంతినగర్, కార్పొరేషన్, మెజస్టిక్, కేఆర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. కొన్నిచోట్ల వడగండ్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.





నగరంలో కురుస్తున్న వర్షం



అంబేడ్కర్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కార్మికసంఘం నాయకులు

ప్రజాప్రతినిధుల తీరు మారాలి

బంగారపేట, మే 1(ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా హామీలను అమలు చేయని కొంతమంది ప్రజాప్రతినిధుల తీరులో మార్పు రావాలని ఏపీఎంసీ లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ కార్మికసంఘం కార్యాధ్యక్షుడు సుబ్రమణి అభిప్రాయపడ్డారు. కోలారు మెయిన్ రోడ్డులోని కెంపేగౌడ సర్కిల్‌లో మేడేను పురస్కరించుకుని కెంపేగౌడ విగ్రహానికి, సంతగేట్ సమీపానగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సుబ్రమణి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కల్పిస్తున్న రీతిలోనే లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ కార్మికవర్గానికి కూడా ప్రభుత్వం సౌలభ్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ నాయకులు ఇచ్చే హామీలు కేవలం అలాగే మిగిలిపోతున్నాయని, ప్రజల సమస్యలు తీరడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీనప్ప, ఉపాధ్యక్షుడు శంకర్, కోశాధికారి మునియప్ప, ఆనంద్, సునిల్, ప్రకాశ్, మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూస్వాధీనానికి రైతులు సహకరించాలి

● ఇన్‌చార్జ్ మంత్రి సుధాకర్



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించిన ప్రారంభిస్తున్న మంత్రి సుధాకర్, ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, మే 1(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని జంగమకోటిలో పారిశ్రామిక వాడకోసం కర్ణాటక పారిశ్రామిక ప్రాంతీయ అభివృద్ధి మండలి (కేఐఏడీబీ) భూములను గుర్తించిందని భూస్వాధీనానికి రైతులు సహకరించాలని చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సుధాకర్ అభిప్రాయపడ్డారు. జంగమకోటె గ్రామపంచాయతీ పరిధిలో రాజీవ్‌గాంధీ సేవా కట్టడ, ఆనూరు గ్రామ పంచాయతీ, చీమంగల గ్రామ పంచాయతీల పరిధిలో సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. హనుమంతపుర గేట్ వద్ద అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ కార్యాలయాన్ని, బశెట్టిహళ్ళి హోబళి రైతు సేవాకేంద్రాన్ని, ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో అదనపు తరగతి గదులను, శౌచాలయాన్ని, ప్రయోగశాలను, హండిగనాళ గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ మేరకు తాలూకాలో పర్యటిస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు సదా సహకరిస్తానన్నారు. జంగమకోటెలో రైతులతో చర్చించారు. భూస్వాధీనానికి కొందరు సానుకూలం వ్యక్తం చేయగా మరికొందరు తిరస్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆకుపచ్చ కండువా వేసుకున్నంత మాత్రాన రైతులు కాలేరన్నారు. రైతుసంఘాలలో కూడా రియల్‌ఎస్టేట్ మాఫియా ప్రభావం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రైతులు పారిశ్రామికవాడకోసం భూములు ఇస్తే అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి సుధాకర్, ఎమ్మెల్యే రవికుమార్‌లను ఆత్మీయంగా సత్కరించారు. గ్రామపంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్క కూటమి అధ్యక్షుడిగా మధురంగయ్య



బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): అమెరికా కన్నడ సంఘాల కూటమి (అక్క) అధ్యక్షులుగా మధురంగయ్య ఎంపికయ్యారు. రెండేళ్ళపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. కార్యదర్శిగా డాక్టర్ నవీన్‌కృష్ణ, కోశాధికారిగా చంద్రు ఆరాధ్య, ఉపాధ్యక్షులుగా రూపశ్రీ మేలుకోటె, రఘుశివరాం, వినోద్‌కుమార్, జాయింట్ సెక్రటరిలుగా మనుగోరూరు, డాక్టర్ లావణ్య సహకార్యదర్శులుగా వత్సా రామనాథన్, డాక్టర్ మోహన్‌కుమార్‌తో పాటు గౌరవ సభ్యులుగా అమరనాథ్‌గౌడ ఎంపికయ్యారు. మొత్తంగా 20మంది పధాధికారులను నియమించారు. అధ్యక్షులు మధురంగయ్య మూలం మండ్య జిల్లా కాగా ఇంజనీరింగ్ చేసిన ఆయన అమెరికాలోని ఓ ప్రైవేటు సేవలు అందిస్తున్నారు. 30 ఏళ్ళుగా అమెరికాలోనే నివసిస్తూ కన్నడ సంఘాలతో పాటు కన్నడిగుల సేవలను కొనసాగిస్తున్నారు. కన్నడ సంఘం 25 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుపదలచినట్లు మధురంగయ్య ప్రకటించారు.

సమతా సైనిక దళ రాష్ట్ర అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్ర సమతా సైనిక దళ రాష్ట్ర అధ్యక్షుడు బి. చన్నక్రిష్ణప్ప రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. బెంగళూరు పరిధిలోని హొసకోటె తాలూకా నందగుడి హోబళి దళసగెరె గ్రామానికి చెందిన చన్నక్రిష్ణప్ప చిక్కబళ్ళాపురం పరిధిలో సమీప బంధువుల పెళ్ళికి వెళ్ళారు. శనివారం అక్కడి నుంచి బెంగళూరుకు వెనుతిరిగి వస్తుండగా కారు టైర్ పేలిపోవడంతో ప్రమాదం జరిగింది. కారులో ఉన్న చన్నక్రిష్ణప్ప అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవింగ్ చేస్తున్న మహిళా న్యాయవాది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. చన్నక్రిష్ణప్ప సుమారు 35 ఏళ్ళుగా దళిత సమాజం అభివృద్ధి కోసం పాటు పడుతున్నారు. ప్రజా సమస్యలకు సంబంధించి ఆయన నిరంతరంగా పోరాటాలు చేస్తుండేవారని ఆప్తులు తెలిపారు. చన్నక్రిష్ణప్ప మృతి పట్ల వివిధ ప్రజాసంఘాలు, దళిత సంఘాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి.



చన్నక్రిష్ణప్ప (ఫైల్)